
సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం, 17, మే, 2023



పట్టణాభివృద్ధికి మోక్షం.!

ఇల్లెందు మున్సిపాలిటీకి సీఎం కేసీఆర్ రూ.25 కోట్లు మంజూరు చేయగా, పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. 8లో



విత్తన ధరలు ఖరారు

వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాల ధరలను తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (టీఎస్ ఎస్‌డీసీ)ఖరారు చేసింది. 8లో

గరిష్టం / కనిష్టం
44° / 28°

వాతావరణం

జిల్లాలో బుధవారం అత్యధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఉదయం నుంచే మొదలయ్యే ఎండ మధ్యాహ్నం మరింతగా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. మంగళవారాన్ని పురస్కరించుకొని ఆంజనేయస్వామి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

చుంచుపల్లి: డీఆర్డీఏ, నవభారత్ ఒకేషనల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో జిల్లాలోని యువతీ, యువకులకు పలు కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు డీఆర్డీఓ జి. మధుసూదన్‌రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెల్డింగ్, ఎలక్ట్రికల్, ఫిట్టర్, ఏసీ, రిఫ్రిజిరేటర్ మెకానిజం, మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్, గార్మెంట్ మేకింగ్ తదితర కోర్సుల్లో అవకాశం కల్పిస్తామని వివరించారు. ఈనెల 25 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 80969 99384 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మెడికల్ షాపుల్లో డీఐ తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఐ సంపత్

బూర్గంపాడు: మండల కేంద్రంలోని పలు మెడికల్ షాపుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సంపత్ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లోని మందులు, అనుమతి పత్రాలను పరిశీలించారు. నిర్వహణ సక్రమంగా లేని రెండు షాపుల యజమానులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

బీఆర్ఎస్ నేతపై చర్యలకు రంగం సిద్ధం?

ఇల్లెందు: సింగరేణి జేకే ఓసీ సేఫ్టీ అధికారి శివప్రసాద్‌పై దాడి చేసిన బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు, టీబీజీకేఎస్ నేత, జేకే ఓసీ ఫిట్టర్ ఎన్. శ్రీనివాసరెడ్డిపై చర్యలకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం శివప్రసాద్‌పై శ్రీనివాసరెడ్డి దాడి చేశాడంటూ సింగరేణి అధికారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఇతర యూనియన్లు కూడా శ్రీనివాసరెడ్డిపై చర్య తీసుకోవాలని ఒత్తిడి చేశాయి. ఈ నేపథ్యంలో టీబీజీకేఎస్ నేతపై చార్జ్‌షీట్ జారీ చేసి సంజాయిషీ కోరినట్లు తెలిసింది. అతడు విధులకు హాజరు కాగానే చార్జ్‌షీట్ అందజేస్తారని తెలిసింది. అయితే ఇప్పటివరకు జరిగిన అనేక ఘటనలకు దీనికి మధ్య తేడా కనిపిస్తోందని, అధికారం మాటున తాత్సారం చేస్తున్నారని సింగరేణి ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీలో ఉంటే డ్యూటీలకు ఎగనామం పెట్టడంతో పాటు అధికారులపై దాడి చేయొచ్చా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇక బీఆర్ఎస్‌లో పట్టణ అధ్యక్షుడిగా పని చేసిన కొక్కు నాగేశ్వరరావుకు ఒక న్యాయం, శ్రీనివాసరెడ్డికి మరో న్యాయమా అంటూ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్‌లోని ఓ వర్గం సన్నద్ధమైనట్లు సమాచారం.

విధుల్లో అలసత్వం తగదు

- జిల్లా సంక్షేమాధికారి సబిత

కొత్తగూడెంటౌన్: సంక్షేమ శాఖలో ఎవరైనా విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా సంక్షేమాధికారి (డీడబ్ల్యూఓ) ఎం.సబిత అన్నారు. సంక్షేమ శాఖ కార్యాలయంలో మంగళవారం పోషణ్ అభియాన్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మే నెలలో పోషణ్ అభియాన్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో విధిగా నిర్వహించాలని, మేరి లైఫ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పోషణ లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని చెప్పారు.

‘పరపతి’ తగ్గుతోంది !

- గతంలో ఘనంగా కొనసాగిన కో ఆపరేటివ్ సొసైటీ
- నేడు ప్రాభవం కోల్పోతున్న ఎస్అండ్‌పీసీ
- ఓ కార్మిక నేత వైఖరే కారణమని ఆరోపణలు
- సొసైటీలో తన మాటే నెగ్గాలనే పంతం



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి సంస్థలో సెక్యూరిటీ విధులు నిర్వహించే 50 మంది సభ్యులతో యాభై ఏళ్ల క్రితం ఎస్అండ్‌పీసీ కో ఆపరేటివ్ సొసైటీ ప్రారంభమైంది. ముందుగా కార్పొరేట్ ఏరియాలో సెక్యూరిటీ విభాగంలో పనిచేసే ఉద్యోగులే ఇందులో సభ్యులుగా ఉండేవారు. కానీ సొసైటీ పనితీరు బాగుండడంతో మిగిలిన విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు కూడా సభ్యులుగా చేరేందుకు ఆసక్తి చూపించారు. ఇలా సభ్యుల సంఖ్య 300 వరకు చేరింది. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఇతర బ్యాంక్‌ల కంటే అధికంగా ఈ సొసైటీలో 11 శాతం వరకు వడ్డీ ఇస్తున్నారు. అలాగే బయట బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేస్తున్నారు. దీంతో ఈ సొసైటీపై సింగరేణి కార్మికులకు నమ్మకం కలిగింది. ఫలితంగా రూ.7 కోట్ల వరకు నగదు జమ అయింది.

ఉద్యోగ విరమణతో మొదలు..

ఈ సొసైటీకి టీబీజీకేఎస్ నేత సోమిరెడ్డి గత 18 ఏళ్లుగా ప్రెసిడెంట్‌గా నిర్విరామంగా కొనసాగారు. ఆయన హయాంలో సొసైటీ మరింత ఆర్థిక పరిపుష్టి సంతరించుకుందనేది కాదనలేని వాస్తవం. అయితే గతేడాది ఆగస్టులో సోమిరెడ్డి ఉద్యోగ విరమణ చేశారు. దీంతో సొసైటీ ప్రెసిడెంట్ పదవిని సైతం వదులుకోవాల్సి వచ్చింది. ఆయన తర్వాత ప్రెసిడెంట్‌గా మోహన్‌రావు, సెక్రటరీగా సుధాకర్ రెడ్డి పాలక మండలిలో కీలక బాధ్యతలు చేపట్టారు. మరో ఐదుగురు డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు. అయితే ఉద్యోగ విరమణ చేసినా సరే సొసైటీపై పెత్తనం కోసం సోమిరెడ్డి యత్నించారనే విమర్శలు వస్తున్నాయి. కార్మిక సంఘ నేత అనే పేరుతో పాలకమండలి నిర్ణయాలను తరుచుగా ప్రభావితం చేసేందుకు ప్రయత్నించడం మొదలెట్టారు. దానికి ప్రస్తుత పాలక మండలి బాధ్యులు ససేమిరా అన్నారు. తన నిర్ణయాలకు మద్దతు ఇవ్వకపోవడంతో ప్రెసిడెంట్, సెక్రటరీలను అనేక విధాలుగా ఇబ్బంది పెట్టేందుకు సోమిరెడ్డి ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ఆరోపణల వెల్లువ..

గతంలో ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు రుణం మంజూరు చేసేందుకు రూ.వేలల్లో సోమిరెడ్డికి మామూళ్లు ఇచ్చుకోవాల్సి వచ్చేదనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ లోన్ పూర్తి కాకముందే మళ్లీ కొత్త రుణం పొందాలంటే మరోసారి మామూళ్లు ఇవ్వాల్సి వచ్చేది. సొసైటీ పదవిని అడ్డు పెట్టుకుని మెడికల్ బోర్డు వ్యవహారాల్లో చక్రం తిప్పుతానంటూ కొంతమంది కార్మికులను ప్రలోభాలకు గురి చేసినట్టు తెలుస్తోంది. ప్రెసిడెంట్ పదవి పోయినా కార్మికుల్లో పలుకుబడి, మామూళ్ల కోసమే సొసైటీపై పెత్తనం చేసేందుకు సోమిరెడ్డి ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

పొగ పెట్టారిలా..

- ఈ ఏడాది జనవరి 25న సొసైటీ ప్రెసిడెంట్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టారు. అయితే నిబంధనల ప్రకారం ప్రెసిడెంట్‌గా ఎన్నికైన వ్యక్తి మూడేళ్ల పదవీ కాలం ముగిసే వరకు అవిశ్వాస తీర్మానం పెట్టే వీలులేదు. దీంతో ఈ తీర్మానం చెల్లలేదు.
- ఈ ఏడాది ఫిబ్రవరిలో ఏడుగురు డైరెక్టర్లలో నలుగురు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. దీంతో పాలకమండలి రద్దయ్యే పరిస్థితి నెలకొంది. అయితే చర్చలతో సమస్యను పరిష్కరించుకోవాలని జిల్లా కోఆపరేటివ్ అధికారి సూచించడంతో నెల రోజులు పాటు సమయం తీసుకుని చివరకు మార్చి 25న పాలకమండలిని రద్దు చేశారు.
- ఈ గొడవల కారణంగా ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో వరుసగా మూడు నెలల పాటు సభ్యులకు వడ్డీ చెల్లించలేదు. దీంతో ఆందోళన నెలకొంది. తమ డిపాజిట్లు తిరిగి ఇచ్చేయాలంటూ సభ్యులు ఒత్తిడి తెచ్చారు. ఫలితంగా మే మొదటి వారంలో ఏకంగా రూ.1.50 కోట్ల డిపాజిట్లు డ్రా చేయాల్సి వచ్చింది. మరింత మంది సభ్యులు తమ డిపాజిట్లు వెనక్కి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ తాత్కాలిక పాలక మండలినే కొనసాగుతోంది.

చర్చలతో పరిష్కారం

జిల్లాలో మంచిగా నడుస్తున్న సొసైటీల్లో ఎస్అండ్ పీసీది అగ్రస్థానం. 50 ఏళ్ల నుంచి ఈ సొసైటీని చక్కగా నిర్వహిస్తున్నారు. ఇటీవల పాలకమండలి సభ్యుల మధ్య విభేదాలు వచ్చాయి. అవిశ్వాసం, డైరెక్టర్ల రాజీనామా వంటి అంశాలు చోటు చేసుకున్నాయి. చర్చలతో సమస్య పరిష్కరించుకోవాలని సూచించాం. ప్రస్తుతం తాత్కాలిక పాలక మండలి కొనసాగుతోంది.

– వెంకటేశ్వర్లు, జిల్లా కోఆపరేటివ్ సొసైటీ అధికారి

ఆధారం లేని ఆరోపణలు

నా వ్యక్తిగత ప్రతిష్ట తగ్గించేందుకు ఆధారం లేని ఆరోపణలు చేస్తున్నారు. సొసైటీ పాలక మండలిని ప్రభావితం చేసేందుకు నేను ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత అక్కడ జరిగే అంశాలతో నాకు సంబంధం లేదు.

– సోమిరెడ్డి, ఎస్అండ్‌పీసీ సొసైటీ మాజీ ప్రెసిడెంట్

లైసెన్స్‌డ్ వ్యాపారుల నుంచే విత్తనాలు కొనాలి

కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): లైసెన్స్ గల వ్యాపారుల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. విత్తనాలు, ఎరువుల సరఫరా, నకిలీ విత్తనాలు అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, వ్యవసాయ, ఉద్యాన అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులతో ఐడీఓసీలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో మధ్యవర్తులు, దళారులు నకిలీ విత్తనాలు అంటగట్టే ప్రయత్నం చేస్తుంటారని, రైతులు వారి నుంచి కొనుగోలు చేసి మోసపోవద్దని అన్నారు. ప్రధానంగా గుంటూరు, బాపట్ల తదితర ప్రాంతాల నుంచి దళారులు గ్రామాలకు వస్తుంటారని, పరిచయం ఉన్న రైతులకు కమీషన్ ఇస్తూ వారితో విత్తనాలు అమ్మిస్తుంటారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. లైసెన్స్‌డ్ డీలర్ల నుంచి కొనుగోలు చేసి, బిల్లు తీసుకోవాలని చెప్పారు. గ్లైఫోసెట్ కలుపు మందు వినియోగించవద్దన్నారు. ఈ మందుతో భూసారం, పంట దిగుబడి తగ్గుతాయన్నారు. మనుషులు కూడా కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన కూడా పడే ప్రమాదం ఉందని చెప్పారు. హెచ్‌టీ కాటన్(హెర్బిసైడ్ టాలరెంట్)కు మన దేశంలో విక్రయాలకు అనుమతి లేదని, అలాంటి నిషేధిత విత్తనాలను రైతులు సాగు చేయొద్దని సూచించారు. ఆ విత్తనాలు అమ్మే వ్యాపారులపై పీడీ యాక్టు కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు తెలిస్తే కంట్రోల్ రూం నంబర్ 7288894276కు ఫోన్ చేసి చెప్పాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ డాక్టర్ వినీత్, అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఉద్యాన అధికారి మరియన్న, డీసీఓ వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ ఏడీలు లాల్‌చంద్, రవికుమార్, అఫ్జల్‌బేగం, సుధాకర్, కరుణశ్రీ, వాసవిరాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన ఎస్పీ వినీత్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలి

నేటి నుంచి గ్రామ పంచాయతీల్లో వారం రోజులు, మున్సిపాలిటీల్లో రెండు వారాల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ నుంచి మంగళవారం ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో 247 వైకుంఠధామాలకు ఈనెలాఖరు నాటికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఎంపీడీఓలను ఆదేశించారు. 30 వైకుంఠధామాలకు తాగునీటి సౌకర్యం కల్పించాల్సి ఉందని, ఈ నెలాఖరు వరకు ఈ ప్రక్రియ కూడా పూర్తి చేయాలని అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున ప్రతి వైకుంఠధామంలో మంచినీరు, విద్యుత్ సౌకర్యం కల్పించిన విషయాన్ని ప్రకటించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీపీఓ రమాకాంత్, జెడ్పీ సీఈఓ విద్యాలత పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

భద్రాచలం: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ భద్రాచలంలో బుధవారం పర్యటించనున్న నేపథ్యంలో అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. రైలు మార్గం ద్వారా కొత్తగూడెం చేరుకోనున్న గవర్నర్ బుధవారం తెల్లవారుజామున ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు వస్తారు. అక్కడి నుంచి ఉదయం 8.30 గంటలకు భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని, ఆ తర్వాత ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. తమిళి సై పర్యటన సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఇతర శాఖల అధికారులను సూచించారు.

రెవెన్యూ అధికారులతో సమీక్ష

మణుగూరు రూరల్ : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బీటీపీఎస్ నిర్వాసితులను ఇళ్లు ఖాళీ చేయించే విషయంలో పురోగతి గురించి ఆర్‌ఐలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిర్వాసితులకు పూర్తి పరిహారం అందజేశామని తెలిపారు. రైల్వేలైన్ నిర్వాసితులతోనూ త్వరగా ఇళ్లు ఖాళీ చేయించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ కె.నాగరాజు, ఆర్‌ఐ లీలావతి తదితరులు పాల్గొన్నారు.



ఫంక్షన్ హాల్ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నిలిచిన విద్యుదుత్పత్తి

పాల్వంచ: కేటీపీఎస్ 7వ దశ కర్మాగారంలో మంగళవారం విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ కలిగిన 11వ యూనిట్ 800 మెగావాట్ల కర్మాగారంలో బాయిలర్ ట్యూబ్ లీకేజీ ఏర్పడటంతో ఉత్పత్తిని నిలిపేశారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు. బుధవారం తిరిగి ఉత్పత్తిని పునరుద్ధరిస్తామని ఎస్ఈ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

ఆ ఇద్దరు విధుల్లో ఎలా..?

పోలీస్‌స్టేషన్‌లో ఆలయ ఈఓ ఫిర్యాదు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో చిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత కాంట్రాక్టర్, పరిపాలనాధికారి ఉత్తర్వులు లేకుండానే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తుండడం గమనార్హం. ఆలయంలో సెక్యూరిటీ సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియమిస్తారు. ఇటీవల సిబ్బంది లెక్కల విషయంలో ఈఓ రమాదేవికి ఫిర్యాదు అందడంతో ఆమె కాంట్రాక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అతడు చెప్పిన సిబ్బంది సంఖ్య కంటే ఇద్దరు అదనంగా విధుల్లో ఉండడంతో ఈఓ అవాక్కయ్యారు. వారిద్దరిని పిలిచి విచారించగా.. మూడున్నర నెలలుగా తాము విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ నియామకం వెనుక ఆలయంలో ఇద్దరు కీలక బాధ్యతలు నిర్వహించే సిబ్బంది పాత్ర ఉన్నట్లు వారు ఈఓకు చెప్పినట్లు సమాచారం. దీంతో ఆమె దీనిపై విచారణ చేయాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలుస్తోంది. దీనిపై పట్టణ సీఐ నాగరాజును వివరణ కోరగా దేవస్థానం నుంచి ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనని, విచారణ జరుపుతున్నామని తెలిపారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

పాలిసెట్ కో ఆర్డినేటర్ నాగముని నాయక్

సింగరేణి(కొత్తగూడెం): జిల్లాలోని 16 కేంద్రాల్లో బుధవారం జరిగే పాలిసెట్‌ను పకడ్బందీగా నిర్వహించాలని పరీక్షల కో ఆర్డినేటర్, కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ బి.నాగముని నాయక్ అన్నారు. మంగళవారం ఆయన పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. బెంచీలపై హాల్ టికెట్ నంబర్లు స్పష్టంగా కనిపించేలా వేయాలన్నారు. పరీక్ష హాల్‌లో లైటింగ్, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం సక్రమంగా ఉండాలని, కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. నిమిషం నిబంధన అమల్లో ఉన్నందున ఉదయం 11 గంటలు దాటిన తర్వాత వస్తే అనుమతించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సింగరేణి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ శారద పాల్గొన్నారు.



సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాగముని నాయక్

మెడికల్ బోర్డ్ జాబితా లీకేజీపై కేసు నమోదు

సింగరేణి(కొత్తగూడెం): ఏప్రిల్ 27, 28 తేదీల్లో సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో జరిగిన కార్పొరేట్ మెడికల్ బోర్డుకు సంబంధించిన జాబితా బోర్డు నిర్వహణకు ముందురోజే సోషల్ మీడియాలో రావడం చర్చనీయాంశమైంది. దీనిపై స్పందించిన కార్పొరేట్ సెక్యూరిటీ విభాగం సీనియర్ అధికారి.. జాబితా లీకేజీకి బాధ్యులెవరో గుర్తించాలని కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పారదర్శకంగా మెడికల్ బోర్డ్ నిర్వహిస్తున్నామని చెప్పిన ఆస్పత్రి, సింగరేణి ఉన్నతాధికారులు కనీసం మీడియాను కూడా అనుమతించలేదు. అయితే కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న మెడికల్ ఇన్‌వాలిడేషన్ ప్రక్రియ జాబితా సోషల్ మీడియాకు చేరడం పట్ల సెక్యూరిటీ విభాగంలో అనుమానం తలెత్తింది. ఇలాంటి ఘటనలపై గతంలోనూ మీడియా ప్రతినిధులు సింగరేణి డైరెక్టర్ పా దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆస్పత్రి ఉద్యోగులను హెచ్చరించారు. అయినా ఫలితం కనిపించకపోగా సదరు ఉద్యోగులు దళారులతో కుమ్మక్కై జాబితాను ఏకంగా సోషల్ మీడియాలో పెట్టించడం గమనార్హం. ఆస్పత్రికి చెందిన కంప్యూటర్లలో భద్రంగా పొందుపరిచిన ఈ జాబితా ఎలా బహిర్గతమైందనే విషయంపై పోలీసులు త్వరలో ఆరా తీయనున్నట్లు సమాచారం. ఈ విషయమై వన్‌టౌన్ సీఐ కరుణాకర్‌ను వివరణ కోరగా జాబితా బహిర్గతమైన ఘటనపై కార్పొరేట్ సీనియర్ సెక్యూరిటీ అధికారి ఫిర్యాదు చేశారని, ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని చెప్పారు.



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రి

ఎందుకీ వెనుకబాటు..?

- పది, ఇంటర్ ఫలితాలపై ఐటీడీఏ పీఓ పోస్ట్‌మార్టమ్
- ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసుల జారీకి నిర్ణయం
- రంగం సిద్ధం చేసిన ఐటీడీఏ అధికారులు



తరగతి గదిలో విద్యార్థులు (ఫైల్)

భద్రాచలం: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ మీడియట్, పదో తరగతి ఫలితాలపై ఐటీడీఏలోని గిరిజన సంక్షేమ శాఖలో పోస్ట్‌మార్టమ్ ప్రారంభమైంది. ఐటీడీఏ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో గిరిజన గురుకులాలు, స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లు, భద్రాద్రి జిల్లాలో ఆశ్రమ పాఠశాలలు, గిరిజన సంక్షేమ హాస్టళ్లు, బెస్ట్ అవైలబుల్ పాఠశాలలు నిర్వహిస్తున్నారు. పదో తరగతి ఫలితాల్లో ఆశ్రమ పాఠశాలల్లో 1,836 మందికి గాను 1,412 మంది(77 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లలో 266 మందికి 160 మంది(60 శాతం), బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో 37 మందికి 35 మంది(95 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇక 14 గిరిజన సంక్షేమ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో 81, ద్వితీయ సంవత్సరంలో 85 శాతం ఉత్తీర్ణత నమోదైంది. వీటిలో ప్రథమ సంవత్సరంలో గతేడాది కంటే కొద్దిగా తగ్గగా, ద్వితీయంలో కొంతమేర పెరిగింది. అయితే వీటిలో దమ్మపేట 50 శాతం, కృష్ణసాగర్ 55.68, సింగరేణి కళాశాల 60 శాతం మాత్రమే ఫలితాలు సాధించి చిట్టచివరి జాబితాలో ఉన్నాయి.

నోటీసుల జారీకి రంగం సిద్ధం..

గతేడాది ఇంటర్ మీడియట్‌తో పాటు ఆశ్రమ పాఠశాలల్లో తక్కువ ఉత్తీర్ణత, తక్కువ గ్రేడ్లు నమోదైన కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు పీఓ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం నుంచీ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి అన్ని రకాల వసతులను కల్పిస్తున్న దృష్ట్యా ఫలితాలు పెరిగేలా కృషి చేయాలని ప్రతీ సమీక్ష సమావేశాల్లో చెబుతూనే ఉన్నారు. అయినా కొన్ని కళాశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో తక్కువ ఫలితాలు నమోదు కావడంతో పీఓ గౌతమ్ పొట్రు ఆగ్రహంగా ఉన్నారు. ఫలితాల నివేదిక సిద్ధం చేయాలని గురుకులం ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్ రాజ్, డీడీ రమాదేవిని ఆదేశించారు. కాగా, వారు ఫలితాల నివేదికను పీఓకు అందజేసినట్లు సమాచారం. ఒకట్రెండు రోజుల్లో పీఓ వాటిని పరిశీలించి షోకాజ్ నోటీసులు, మెమోల జారీ వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. వివిధ గురుకుల కళాశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలతో పాటు ఉపాధ్యాయులు కూడా నోటీసులు అందుకుంటారని తెలిసింది.

ఆ పాఠశాలల్లోనే ఎందుకు ?

గిరిజన గురుకులాలతో పాటు ఆశ్రమ పాఠశాలల్లో ఫలితాలపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కొన్ని పాఠశాలలు, కళాశాలల్లో ఉత్తమ ప్రతిభ చాటి విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించగా, మరికొన్ని పాఠశాలల్లో వెనుకబడడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా సెల్ఫ్ సెంటర్ లేని పాఠశాలలు, కళాశాలల్లోనే ఫలితాలు తక్కువగా రావడం, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లలో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు అత్యధికంగా ఫెయిల్ కావడం ఈ విమర్శలకు ఊతమిస్తున్నాయి. గిరిజన విద్యార్థులకు ఐటీడీఏ అన్ని వసతులు కల్పిస్తోంది. అయితే వీటిని ఆచరణలో పెట్టడంలో కొందరు ఉపాధ్యాయుల అలసత్వంతో పాటు కోవిడ్ సమయంలో విద్యార్థుల్లో తగ్గిన సామర్థ్యంతో ఫలితాలు తక్కువగా నమోదవుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. వీటితో పాటు ఐటీడీఏ ఉన్నతాధికారులు జూమ్ మీటింగ్‌లు, సమీక్షలకే పరిమితమయ్యారు తప్ప క్షేత్రస్థాయిలో పర్యటించడం, తనిఖీలు చేయడం లేదని, తద్వారా బోధనా సిబ్బందిలో నిర్లక్ష్యం పెరిగిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా కోవిడ్ ప్రభావంతో చదువుకు దూరమైన విద్యార్థులు ఫలితాల్లో వెనుకబడుతున్నారని, ఈ పరిస్థితుల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ప్రిన్స్‌పాళ్లకు షోకాజ్ నోటీసులు, మెమోలు జారీ చేయడం సరికాదని ఉపాధ్యాయ సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు.

పీఓకు నివేదిక అందజేశాం



ఫలితాలపై విశ్లేషణతో కూడిన నివేదికను ఇప్పటికే ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రుకు అందజేశాం. దీనిపై పీఓ సమీక్షించి తదుపరి చర్యలు చేపడతారు. ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించేందుకు పీఓ సారథ్యంలో ముందస్తుగానే పలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– రమాదేవి, ఐటీడీఏ డీడీ

క్లుప్తంగా

భద్రాద్రి చేరిన 'సాష్టాంగ' యాత్ర


సాష్టాంగ నమస్కార యాత్రలో ఉత్తరాఖండ్ వాసులు

భద్రాచలంటౌన్: ప్రజలు సుభిక్షంగా ఉండడంతో పాటు లోక కల్యాణం కోసం ఉత్తరాఖండ్‌కు చెందిన ఐదుగురు చేపట్టిన సాష్టాంగ నమస్కార యాత్ర మంగళవారం రాత్రి భద్రాచలం చేరుకుంది. ఉత్తరఖాండ్ రాష్టానికి చెందిన ఐదుగురు ఈ యాత్రను 2022 జూన్‌లో ప్రారంభించారు. ఈ ఏడాది రామేశ్వరం చేరడంతో యాత్ర ముగుస్తుందని వారు పేర్కొన్నారు. ఈమేరకు వారు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి రామాలయంలో పూజలు చేశారు.

ప్రమాదవశాత్తు పూరిల్లు దగ్ధం

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని దళితకాలనీకి చెందిన మురికిపూడి వీర్రాజుకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంలో మంగళవారం దగ్ధమైంది. దీంతో బాధిత కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. ఇంట్లో వారంతా పనికి వెళ్లగా మధ్యాహ్నం సమయంలో మంటలు వ్యాపించి ఇంటిని చుట్టుముట్టాయి. తాటాకులతో నిర్మించిన ఇల్లు కావడంతో మంటలను అదుపుచేసే అవకాశం లేకుండా పోయింది. ఇంట్లోని సామగ్రి మొత్తం అగ్నికి ఆహుతైంది. ఘటనా స్థలాన్ని ఆర్‌ఐ ఆదినారాయణ సందర్శించి పంచనామా నిర్వహించారు. రూ.95 వేలు నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

దమ్మపేట: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మల్లారం గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ములకలపల్లి మండలం సీతాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన మడివి రవి (37) మండలంలోని అప్పారావుపేట గ్రామ శివారు నుంచి దమ్మపేట వైపునకు తన ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో గెలలు దిగుమతి చేసి దమ్మపేట వైపునకు వస్తున్న ట్రాక్టర్.. బైక్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో రవి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

శతాధిక వృద్ధుడు మృతి

టేకులపల్లి: శతాధిక వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ప్రెగళ్లపాడు పంచాయతీ తూర్పుగూడెం గ్రామానికి చెందిన మాడె కిట్టయ్య (104) అనారోగ్యంతో బాధ పడుతూ మంగళవారం మృతి చెందాడు. ఆయనకు భార్య బుచ్చమ్మ, ముగ్గురు కుమారులున్నారు.

బావిలో మృతదేహం?

టేకులపల్లి: మండలంలోని తావుర్యాతండా పంచాయతీ తడికలపూడి రైల్వేస్టేషన్ వెనకాల బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందనే ప్రచారంతో స్థానికుల్లో కలకలం రేపింది. బావిలో మృతదేహం ఉన్నట్లుగా భావించిన కొందరు గ్రామస్తులు మంగళవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా, బావిలో ఉన్నది మృతదేహం కాకపోవచ్చని కొందరు చెబుతుండడం, అప్పటికే చీకటి పడడంతో బుధవారం బయటకు తీసి పరిశీలిస్తామని ఎస్‌ఐ రమణారెడ్డి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

ఇల్లెందు: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్టేషన్‌బస్తీలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. స్టేషన్‌బస్తీకి చెందిన మచ్చ శ్రీకాంత్ (33) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుండగా వచ్చే ఆదాయంతో కుటుంబం గడవటం కష్టంగా మారింది. తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీకాంత్ తన భార్య బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శ్రావ్య ఫిర్యాదు మేరకు సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

ఇల్లెందు: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తుండటంతో తట్టుకోలేక ఆమె పోలీసులను ఆశ్రయించింది. విచారించిన పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని స్టేషన్‌బస్తీకి చెందిన చాందినికి ఖమ్మానికి చెందిన ఖలీద్‌తో 2021లో వివాహం జరిగింది. కొంతకాలంగా అదనపు కట్నం కావాలని భార్యను వేధిస్తున్నాడు. చిత్రహింసలు తాళలేని చాందిని ఫిర్యాదు చేసింది. విచారించి భర్త ఖలీద్‌తో పాటు అతడి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశామని సీఐ కరుణాకర్ తెలిపారు.

- **భద్రాచలంటౌన్:** భార్యను వేధిస్తున్న వ్యక్తిపై మంగళవారం భద్రాచలం టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అశోక్‌నగర్ కాలనీకి చెందిన మమత, మల్లికార్జున్‌కి పదిహేనేళ్ల క్రితం వివాహం జరగగా ఇటీవల మల్లికార్జున్‌ను ఆమెను తరచుగా వేధిస్తున్నాడు. దీంతో మమత ఫిర్యాదు పేరుకు కేసు నమోదైంది.

ఖరీఫ్ విత్తన ధరలు ఖరారు

- ఈసారి స్వల్పంగా ధర పెంచిన విత్తనాభివృద్ధి సంస్థ
- పచ్చిరొట్ట విత్తనాలది అదే బాట.. రాయితీ మాత్రం కొనసాగింపు
- ఉమ్మడి జిల్లాలో అందుబాటులోకి వస్తున్న విత్తనాలు




ఖమ్మం విత్తనాభివృద్ధి గోదాములో సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు

ఖమ్మంవ్యవసాయం: వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ(టీఎస్ఎస్‌డీసీ) విత్తనాల ధరలను ఖరారు చేసింది. గత ఏడాదితో పోలిస్తే విత్తన ధరలు స్వల్పంగా పెరిగాయి. అయితే, పచ్చిరొట్ట విత్తనాలకు మాత్రం యథాతథంగా 65 శాతం సబ్సిడీని కొనసాగించనున్నట్లు వెల్లడించారు. ఇక వరి, అపరాలు, నూనె గింజల విత్తనాలకు మాత్రం ఎలాంటి సబ్సిడీ ఇవ్వడం లేదు. సహకార సంఘాలు, ఆగ్రో సేవా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించిన సంస్థ.. వానాకాలం పంటల సాగుకు ముందు భూసారాన్ని పెంచేందుకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలను ఇప్పటికే సిద్ధం చేశారు.

అవసరాలకు అనుగుణంగా..

ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అనువైన విత్తన రకాలను అందుబాటులో తీసుకురావాలని విత్తాభివృద్ధి సంస్థ నిర్ణయించింది. పచ్చిరొట్ట విత్తనాలను ఉత్తరాది రాష్ట్రాల నుంచి తెప్పిస్తున్నారు. ఇక ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ప్రధాన పంట అయిన వరితో పాటు పెసర విత్తనాలను నిర్దేశించిన వ్యవసాయ క్షేత్రాల నుంచి సేకరించి, ప్రయోగశాలల్లో పరీక్షించాక విత్తనశుద్ధి చేసి విక్రయించనున్నారు. అలాగే, జిల్లాల వ్యవసాయ శాఖలు ఇచ్చిన నివేదిక మేరకు పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. వరి, అపరాలు, నూనె గింజల విత్తనాలకు సంబంధించి ఇండెంట్లు అందాల్సి ఉంది. అయినప్పటికీ ఉమ్మడి జిల్లాలో వినియోగించే విత్తన రకాలను సిద్ధం చేస్తున్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు రెడీ

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రైతులకు కావాల్సిన జీలుగ విత్తనాలు 19 వేల క్వింటాళ్లు, పిల్లి పెసర 500 క్వింటాళ్లు, జనుము 650 క్వింటాళ్ల విత్తనాలను సిద్ధంచేశారు. జీలుగ విత్తనాలను పీఏసీఎస్‌లకు చేరుస్తున్నారు. కాగా, గత ఏడాది 30 కిలోల సంచి జీలుగ విత్తనాల ధర రూ.664.20 ఉండగా ప్రస్తుతం రూ.842.70గా నిర్ణయించారు. జనుము 40 కిలోల సంచి ధర రూ.1,165.60 నుంచిరూ.1,224.80కి, పిల్లిపెసర 20 కిలోల విత్తన బ్యాగ్ ధర రూ. 619.20 నుంచి రూ.703.40కు పెరిగింది.

వరి, అపరాలు, నూనె గింజలు కూడా..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైతుల అవసరాల కోసం తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఇప్పటికే వరిలో బీపీటీ-5204(సాంబమసూరి) రకం ఆరు వేల క్వింటాళ్ల విత్తనాలను సిద్ధంగా చేసింది. ఎంటీయూ-1061 రకం 8,500 క్వింటాళ్లు, ఎంటీయూ-1010 రకం 1,900 క్వింటాళ్లు కేఎన్ఎం-1638 రకం 250 క్వింటాళ్లు సిద్ధం చేశారు. ఇంకా పెసర ఎంజీజీ-295 రకం 1,750 క్వింటాళ్లు, మినుములు పీయూ-31 రకం 2,800 క్వింటాళ్లు, కందులు ఎల్ఆర్‌జీ-41 రకం 321 క్వింటాళ్లు, నూనె గింజల పంటల్లో వేరుశనగ కే-6 రకం 300 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు. అయితే రెండు జిల్లాల అధికారులు ఇండెంట్ ఆధారంగా మరిన్ని విత్తనాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. కాగా, వరి, అపరాలు, నూనె గింజల విత్తన సంచుల ధరలు కూడా రూ.20 నుంచి రూ.100 వరకు పెరిగాయి.

వరి విత్తనాల ధర (రూ.ల్లో)

రకం	పరిమాణం	ధర
బీపీటీ-5204	25 కిలోలు	887.50
ఎంటీయూ-1061	30 కిలోలు	1,059.00
ఎంటీయూ-1001	25 కిలోలు	882.50
ఎంటీయూ-1010	25 కిలోలు	882.50
జేజీఎల్-24423	25 కిలోలు	880.50
పీకేవీ హెచ్‌ఎంటీ	25 కిలోలు	912.50
కేఎన్ఎం-118	25 కిలోలు	882.50

అపరాలు, నూనె గింజల విత్తన ధరలు (రూ.ల్లో)

రకం	పరిమాణం	ధర
పెసర ఎంజీజీ-295	4 కిలోలు	432.40
కందులు ఐసీపీఎల్-87119	4 కిలోలు	452.00
పీఆర్‌జీ-176	2 కిలోలు	452.00
మినుములు పీయూ-31	4 కిలోలు	424.00
వేరుశనగ కే-6	30 కిలోలు	2,865.00

సకాలంలో రైతులకు విత్తనాలు



రానున్న ఖరీఫ్‌లో రైతులకు సకాలంలో విత్తనాలు అందించేలా చర్యలు చేపట్టాం. ఇప్పటికే వివిధ ప్రాంతాల నుంచి పచ్చిరొట్ట విత్తనాలను తెప్పించాం. వరి, కంది, పెసర మినుము విత్తన రకాలను కూడా సిద్ధం చేస్తున్నాం. సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాలను రైతులకు విక్రయించేలా కార్యాచరణ రూపొందించాం.

– ఎస్.బిక్షం, ప్రాంతీయ మేనేజర్, విత్తనాభివృద్ధి సంస్థ, ఉమ్మడి ఖమ్మం జిల్లా

పట్టణాభివృద్ధికి మోక్షం.!

- సీఎం నిధులు రూ. 8.82 కోట్లతో 21 పనులు
- అసంపూర్తి, పెండింగ్ పనులకు కేటాయింపు
- డీపీఆర్ కోసం టెండర్ పిలిచిన అధికారులు
- ఇల్లెందు మున్సిపాలిటీలో అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి


నిధులు లేక అసంపూర్తిగా నిలిచిపోయిన మల్టీ యుటిలిటీ సెంటర్


కాజ్‌వే నిర్మించనున్న ఇల్లెందులపాడు అలుగువాగు ఇదే..

ఇల్లెందు: కల్వర్టులు, వాగులపై బ్రిడ్జీలు, డ్రెయిన్లు, సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాల మార్పిడి ఇలా ఇల్లెందు పట్టణంలోని మరో 21 అభివృద్ధి పనులకు సీఎం కేసీఆర్ కేటాయించిన నిధులతో మోక్షం లభిస్తోంది. మూడు నెలల క్రితం సీఎం కేసీఆర్ జిల్లాకు వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే హరిప్రియ కోరిక మేరకు ఇల్లెందు మున్సిపాల్టీకి రూ.25 కోట్లు కేటాయించిన విషయం విదితమే. ఆ నిధుల నుంచి సుమారు రూ.8.82 కోట్లతో 21 పనులను చేపట్టాలని తాజాగా నిర్ణయించారు. పనుల గుర్తింపునకు రెండు నెలల క్రితమే పట్టణంలోని 24 వార్డుల్లో పర్యటించారు. తక్షణం చేపట్టాల్సిన పనులకు నిధులు కేటాయించడంతో పాటు డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) కోసం రెండు రోజుల క్రితమే టెండర్ పిలిచారు. నేటి(బుధవారం) సాయంత్రం 5 గంటల్లోపు దాఖలైన టెండర్లను పరిశీలించి ఖరారు చేయనున్నారు. ఈ నెలాఖరు నాటికి డీపీఆర్ సిద్ధమైతే వచ్చే నెలలో 21 అభివృద్ధి పనులకు టెండర్ పిలిచి పనులు ప్రారంభించనున్నారు.

పట్టణంలో చేపట్టనున్న పనులు ఇలా ..

- ఇల్లెందు పట్టణంలోని రాంమోహన్ మెడికల్ షాప్ నుంచి బుగ్గవాగు వరకు రూ. 8 లక్షలతో బాక్స్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది.
- బర్లపెంట మీదుగా సత్యనారాయణపురం వాసులకు రాకపోకల కోసం పదేళ్ల క్రితం మట్టిరోడ్డు పోశారు. ఇప్పుడు ఈ రహదారిని సీసీ రోడ్‌గా మార్చాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ. కోటి నిధులు కేటాయించారు.
- మహబూబాబాద్ క్రాస్ రోడ్ నుంచి కరెంటాఫీస్ – బీబీఆర్ రైస్ మిల్ వరకు రోడ్ విస్తరణ చేపట్టాల్సి ఉంది. ఇందుకు రూ. 2 కోట్లు కేటాయించారు.
- సభలు, సమావేశాలు, విందులు, పెళ్లిళ్ల నిర్వహణకు పట్టణ నడిబొడ్డున మల్టియుటిలిటీ సెంటర్ నిర్మాణం చేపట్టారు. అయితే నిధులు లేక గత ఆరు నెలలుగా పనులు నిలిచిపోయాయి. ఈ భవనం పూర్తి చేసేందుకు రూ.75 లక్షలు కెటాయించారు.
- నిరుద్యోగ యువతకు ఆయా రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణ పనులు ప్రారంభించగా, నిధులు సరిపోక ఆగిపోయింది. దీన్ని పూర్తి చేసేందుకు రూ. 70 లక్షలు కేటాయించారు.
- ఇల్లెందులపాడు శ్మశానవాటికకు వెళ్లే దారిలో అలుగు వాగు మీద చప్టా గత వర్షాకాలంలో తెగిపోయింది. ఈ బ్రిడ్జి నిర్మాణానికి రూ.30 లక్షలు కేటాయించారు. ఇంకా 24 మంది వార్డు కౌన్సిలర్లు, వార్డు ఆఫీసర్లు ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు వీలుగా ఒక్కో వార్డుకు ఒక గది నిర్మించనున్నారు. ఇందుకు రూ.72 లక్షలు కేటాయించారు. ఇంకా మున్సిపల్ గెస్ట్ హౌస్, బుగ్గవాగుపై లోలెవల్ కాజ్‌వే, మెయిన్‌రోడ్‌లో సెడ్ డ్రెయిన్లు, పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటు వంటి అనేక పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ పనులన్నీ సకాలంలో పూర్తి చేసి పట్టణ ప్రజల సమస్యలను పరిష్కరించి అభివృద్ధి ఫలాలు వారి ముంగిట చేర్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ అంకుషావలి తెలిపారు.

పట్టణాభివృద్ధికి శ్రీకారం



పట్టణంలోని 24 వార్డుల్లో అనేక ఏళ్లుగా చేపట్టని పనులు, నిధులు లేక నిలిచిపోయిన పనులు, నూతనంగా శ్రీకారం చుట్టబోతున్న పనులు వెరసి సుమారు రూ.9 కోట్లతో 21 పనుల డీపీఆర్‌కు టెండర్లు పిలుస్తున్నాం. ఇటీవల సీఎం కేసీఆర్ మున్సిపాలిటీకి కేటాయించిన నిధులతో ఈ పనులన్నీ చేపడతాం. రెండు నెలల క్రితం ఎమ్మెల్యే హరిప్రియతో కలిసి వార్డుల్లో పర్యటించి ప్రజల అవసరాలు గుర్తించాం. ఆ పనులకు ప్రాధాన్యత ఇస్తాం.

–దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మున్సిపల్ ౘైర్మన్

డబుల్ బెడ్రూమ్ ఇళ్లు అప్పగించాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

జూలూరుపాడు: డబుల్ బెడ్రూమ్ ఇళ్లు అప్పగించాలని డిమాండ్ చేస్తూ పాపకొల్లు గ్రామ పంచాయతీ భీమ్లాతండాలోని ఇళ్ల ఎదుట మంగళవారం లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాపకొల్లు గ్రామ పంచాయతీ భీమ్లా తండాలో రాష్ట్ర ప్రభుత్వం 51 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు నిర్మించిందని, 2020, అక్టోబర్ 28న రెవెన్యూ అధికారులు లాటరీ పద్ధతిన 51 మంది లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించారని తెలిపారు. కానీ, అధికారికంగా ఇప్పటివరకు ప్రారంభించలేదన్నారు. కొందరు అక్రమంగా ఆక్రమించుకొని నివాసం ఉంటున్నారని, వారిని తక్షణమే ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు. తమకు కేటాయించిన ఇళ్లలో ఇతరులు అక్రమంగా ఉంటున్నారని మూడేళ్లుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

న్యాయమూర్తిని కలిసిన పారాలీగల్ వలంటీర్లు


కోర్టు ఆవరణలో పారాలీగల్ వలంటీర్లు

కొత్తగూడెంటౌన్: జిల్లా న్యాయాసేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి జి.భానుమతిని పారాలీగల్ వలంటీర్లు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో నల్సార్ యూనివర్సిటీలో రైతు చట్టాలపై నిర్వహించిన సదస్సులో పాల్గొన్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా అగ్రిలీడ్ క్లినిక్‌లను లోతువాగు, లక్ష్మీదేవిపల్లి, సుదిమల్ల, ఇల్లెందు, గట్టుమల్లారం, మణుగూరు, దుమ్ముగూడెం, భద్రాచలంలలో ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్లు రాజామణి, అనురాధ, ఇమామ్, రమేశ్‌తోపాటు కవిత, అఖిల్ సాయి, కిశోర్‌కుమార్, సతీశ్, రామకృష్ణ, పవన్‌కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు కొరియర్ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్/దుమ్ముగూడెం: నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన కొరియర్ కపిల్‌రాయ్‌ను దుమ్ముగూడెం పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ సభ్యులు మంగళవారం అరెస్టు చేశారు. వివరాలను తన కార్యాలయంలో ఎస్పీ వినీత్ వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా పాడియం గ్రామానికి చెందిన, మావోయిస్టు బెటాలియన్ కొరియర్‌గా పనిచేస్తున్న కపిల్‌రాయ్‌ను దుమ్ముగూడెం మండలం పైడిగూడెం ఆటవీ ప్రాంతంలో దుమ్ముగూడెం పోలీసులు, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన కూంబింగ్‌లో అరెస్ట్ చేశారని చెప్పారు. తన పేరు కపిల్‌రాయ్ అని, మావోయిస్టు కొరియర్‌గా పనిచేస్తున్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. కపిల్‌రాయ్ నుంచి పేలుడు పదార్థాలు, ఎయిర్‌గన్, రంపపు మిషన్, డ్రిల్ మిషన్, రూ.45 వేల నగదును స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. నిందితుడు వారాంతపు సంతలో వ్యాపారం చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడని ఎస్పీ వివరించారు. సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్‌తోపాటు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి


తనిఖీ చేస్తున్న అధికారులు

భద్రాచలంటౌన్: ఆస్పత్రులు, ల్యాబ్‌లు, డయాగ్నొస్టిక్ సెంటర్లు పక్కాగా నిబంధనలు పాటించాలని డిప్యూటీ డీఈఎంఓ ఎండీ ఫయాజ్‌మొయిద్దీన్ అన్నారు. డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు మంగళవారం ఆయన ఆస్పత్రులు, ల్యాబ్‌లు, డయాగ్నొస్టిక్ సెంటర్లలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అర్హత లేని మూడు డయాగ్నొస్టిక్ సెంటర్లను సీజ్ చేయడంతో పాటు మరో మూడింటికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఓస్ఓ యానోక్, హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎం కప్ మొదలైందా? లేదా?

- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్


ఎదురుచూస్తున్న క్రీడాకారులు

భద్రాచలంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలను అన్ని మండలాలో అధికారులు ప్రారంభించారు. కానీ, భద్రాచలం మండలంలో అందుకు విరుద్ధంగా ప్రారంభమయ్యాయి. కలెక్టర్ ఆదేశాల ప్రకారం సీఎం కప్ క్రీడాపోటీలు ఉదయం నుంచే ప్రారంభం కావాలి. కానీ, భద్రాచలంలో పోటీలు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న క్రీడాకారులు ఉదయం హాజరుకావాలని సూచించారు. ఉదయమే వచ్చిన క్రీడాకారులు మైదానంలో ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరా మైదానానికి వచ్చిన సంబంధిత అధికారులు ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, సాయంత్రం నిర్వహిస్తామని తెలిపారు. దీంతో క్రీడాకారులు నిరుత్సాహంతో వెనుదిరిగారు. ఇదిలా ఉండగా సాయంత్రం ఐదు గంటల సమయానికి అధికారులు మైదానానికి వచ్చారు. అసలు సీఎం కప్ క్రీడలు ప్రారంభమైన్నట్లా? లేదా? అనే విషయమై పంచాయతీ ఈఓను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

ట్రాక్టర్ పల్టీ.. యువకుడు మృతి


శ్రీరామ్ మృతదేహం

టేకులపల్లి: పొలంలో దుక్కి దున్నుతుంటే ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని బేతంపూడి పంచాయతీ వెంకట్యాతండాకు చెందిన బోడ శ్రీరామ్ (25) మంగళవారం తన పొలంలో దుక్కి దున్నేందుకు ట్రాక్టర్ నడుపుకుంటూ వెళ్లాడు. పొలంలో దుక్కి దున్నుతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి ఒక్కసారిగా బోల్తా కొట్టడంతో దాని కింద పడిన శ్రీరామ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని ఇల్లెందు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి ఏడాది కిందటే వివాహమైంది. ప్రస్తుతం అతడి సతీమణి గర్భిణి కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి సోదరుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సమ్మె చేస్తున్న వీఓఏకు అస్వస్థత


స్పృహ కోల్పోయిన మహాలక్ష్మి

ములకలపల్లి: మండలంలోని మాధారం గ్రామానికి చెందిన వీఓఏ ముదిగొండ మహాలక్ష్మి అస్వస్థతకు గురికావడంతో సమ్మె శిబిరంలో ఆందోళన నెలకొంది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో నిర్వహిస్తున్న వీఓఏల సమ్మెలో పాల్గొన్న మహాలక్ష్మి మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా అనారోగ్యానికి గురై స్పృహ కోల్పోయింది. ఆమెను వెంటనే మంగపేట పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక వైద్యం అనంతరం కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. మహాలక్ష్మి వడదెబ్బకు గురైనట్లు వైద్యులు తెలిపారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని సంఘం మండల అధ్యక్షురాలు కనకలక్ష్మి తెలిపారు.

మైనర్‌పై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: బాలికను ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తున్న బాలుడు (మైనర్)పై మంగళవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాజేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ఓ ప్రాంతానికి చెందిన 14 ఏళ్ల బాలికను అదే ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలుడు కొద్ది రోజులుగా ప్రేమిస్తున్నానని వేధిస్తున్నాడు. ఈ వేధింపులు అధికం కావడంతో బాధితురాలు తల్లిదండ్రులకు చెప్పింది. బాధితురాలి తల్లి చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుతో బాలుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అమరావతి భూములు.. సింగపూర్‌లో సంతర్పణ!

సింగపూర్ ప్రభుత్వమంటూ.. చివరకు ఓ ప్రైవేట్ కంపెనీతో ఒప్పందం

- కేంద్ర ప్రభుత్వం అనుమతి లేదు... టెండర్ల ప్రక్రియ మాటే తేలేదు
- సింగపూర్ కంపెనీకి ముందుగానే అమరావతి మ్యాపులు.. అనంతరం బినామీల పేరుతో భూముల కొనుగోలు
- చంద్రబాబు – నారాయణ భూదందాకు కేంద్రస్థానంగా సీడ్ క్యాపిటల్
- స్విస్ చాలెంజ్ పేరుతో భూదోపిడీ



సాక్షి, అమరావతి: సింగపూర్ కంపెనీల ముసుగు తొలగిపోవడంతో అమరావతి కేంద్రంగా సాగిన భూదందా విస్మయపరుస్తోంది. చంద్రబాబు సింగపూర్ పర్యటనలు.. ప్రైవేట్ కంపెనీలతో ఎంవోయూలు.. స్విస్ చాలెంజ్ ఒప్పందాల వెనుక తీగను లాగుతుంటే కరకట్ట ఇంట్లో అవినీతి డొంక కదులుతోంది. అమరావతి మాస్టర్‌ప్లాన్, సీడ్ క్యాపి టల్ ప్లాన్ ఫైళ్లను తిరగేస్తుంటే బినామీల పేరుతో చంద్రబాబు, నారాయణ కొల్లగొట్టిన భూముల దస్త్రాలు బయటపడుతున్నాయి. సీఐడీకి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణతో భూదోపిడీ మొత్తం బయటపడుతోంది.

■ కమిటీలో సింగపూర్ కంపెనీ ప్రతినిధి

2014 జూన్‌లో అధికారం చేపట్టగానే రాజధాని పేరిట చంద్రబాబు భారీ భూదోపిడీకి పన్నాగాన్ని రూపొందించారు. 2015 జూలైలో రాజధాని సలహా కమిటీని నియమించి పొంగూరు నారాయణ, సుజనా చౌదరి, గల్లా జయదేవ్‌తోపాటు సింగపూర్ కంపెనీ ప్రతినిధికి స్థానం కల్పించడం గమనార్హం. అంతర్జాతీయ కాంపిటీటివ్ బిడ్డింగ్‌కు వెళ్తున్నందున విదేశీ కంపెనీ ప్రతినిధిని సభ్యుడిగా నియమించడంపై అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు అభ్యంతరం తెలిపినా చంద్రబాబు పట్టించుకోలేదు. సింగపూర్ కంపెనీకి రాజధాని ప్రాంత ఎంపిక బాధ్యతను అప్పగించడం ద్వారా భారీ భూదోపిడీకి అప్పుడే పథకం వేశారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఉద్దేశించిన ఏపీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎనేబిలింగ్ యాక్ట్‌ను కూడా టీడీపీ సర్కారు ఉల్లంఘించింది. ఓపెన్ కాంపిటీషన్ ద్వారా డెవలపర్‌ను ఎంపిక చేయాలన్న నిబంధనను చంద్రబాబు ఖాతరు చేయలేదు.

■ కేంద్రం అనుమతి లేదు.. టెండర్లూ లేవు

2014 నవంబరులో చంద్రబాబు సింగపూర్ పర్యటనలోనే భూదోపిడీకి స్కెచ్ వేశారు. ఆ వెంటనే డిసెంబరులో రాజధాని మాస్టర్‌ప్లాన్ రూపొందించేందుకు సింగపూర్ కంపెనీతో చంద్రబాబు ప్రభుత్వం ఏకపక్షంగా ఎంవోయూ కుదుర్చుకుంది. విదేశీ కంపెనీతో చేసుకునే ఒప్పందాలకు కేంద్ర ప్రభుత్వ అనుమతి అవసరం. అయితే కేంద్రం అనుమతి లేకుండానే ఎంవోయూ కుదుర్చుకోవడం గమనార్హం. ఏకంగా సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంటున్నట్లు అప్పటి సీఎం చంద్రబాబు బుకాయిస్తూ వచ్చారు. తద్వారా ఇతర కంపెనీలు పోటీకి రాకుండా నిరోధించారు. కానీ సంబంధిత శాఖల నోట్ ఫైల్స్‌లో ఎక్కడా సింగపూర్ ప్రభుత్వం అనే ప్రస్తావనే లేదు. చివరికి చంద్రబాబు ప్రభుత్వం ఎంవోయూ చేసుకుంది సింగపూర్ ప్రభుత్వంతో కాకుండా ఓ ప్రైవేట్ కంపెనీతో కావడం గమనార్హం. ఇక రాజధాని ప్రాంతంలో అత్యంత కీలకమైన సీడ్ క్యాపిటల్ ఎంపిక కోసం ప్రత్యేకంగా మాస్టర్ ప్లానర్‌ను చంద్రబాబు ప్రభుత్వం ఏకపక్షంగా ఎంపిక చేసింది. అందుకోసం కనీసం టెండర్ల ప్రక్రియ కూడా చేపట్టలేదు. సింగపూర్‌కే చెందిన కంపెనీలను మాస్టర్ డెవలపర్‌గా ఎంపిక చేయాలని ఎంవోయూలో స్పష్టం చేశారు. రాజధాని మాస్టర్ ప్లాన్ రూపొందించే కంపెనీ, సీడ్ క్యాపిటల్ మాస్టర్ డెవలపర్ ఎవరన్నది చంద్రబాబు ముందుగానే నిర్ణయించేశారు.

■ 2015 జనవరిలోనే అమరావతి మ్యాపులు...

రాజధానిలో కీలకమైన సీడ్ క్యాపిటల్ ప్రాంతం ఎంపికలో చంద్రబాబు తన పన్నాగాన్ని అమలులోకి తెచ్చారు. విజయవాడ-గుంటూరు-తెనాలి- మంగళగిరి(వీజీటీఎం) పరిధిలోని జోనింగ్ మ్యాపులన్నీ 2015 జనవరిలోనే సింగపూర్ మాస్టర్ డెవలపర్‌కు గుట్టుచప్పుడు కాకుండా టీడీపీ ప్రభుత్వం అప్పగించేసింది. ఆ మ్యాపుల్లో పేర్కొన్న ప్రాంతాల్లోనే రాజధాని, సీడ్ క్యాపిటల్‌ను ఎంపిక చేయాలని చంద్రబాబు ప్రభుత్వం స్పష్టం చేసింది. కృష్ణా నదికి అభిముఖంగా ఉద్దండరాయునిపాలెం, తాళ్లాయపాలెం, లింగాయపాలెం గ్రామాల పరిధిలో సీడ్ క్యాపిటల్‌ను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. అంటే రాజధాని, సీడ్ క్యాపిటల్ ఏ మండలాలు, గ్రామాల పరిధిలో రానున్నాయో చంద్రబాబు, నారాయణ, వారి బినామీలకు ముందుగానే తెలుసన్నది స్పష్టమైంది. అనంతరం సింగపూర్ కంపెనీ సీడ్ క్యాపిటల్ మాస్టర్ ప్లాన్‌ను 2015 జూలైలో ప్రభుత్వానికి సమర్పించి కథ ముగించింది.

■ పచ్చ ముఠా గుప్పిట్లో సీడ్ క్యాపిటల్

2015 జనవరిలోనే సీడ్ క్యాపిటల్ ఎక్కడ రానుందో తెలిసిన చంద్రబాబు, నారాయణ తమ బినామీలను రంగంలోకి దింపారు. ఆ ప్రాంతంలో అతి తక్కువ ధరకు భూములను భారీగా కొనుగోలు చేశారు. సీఐడీ దర్యాప్తులో ఈ బినామీ లావాదేవీలు వెలుగులోకి వస్తున్నాయి. నారాయణ తన బినామీలు, బంధువుల పేరిట 65.50 ఎకరాలు కొనుగోలు చేసినట్లు సీఐడీ విచారణలో వెల్లడైంది. నారాయణ భార్య రమాదేవి, అల్లుడు డైరెక్టర్లుగా ఏర్పాటైన ఎన్‌స్పైరా కంపెనీ నుంచి నిధులను తమ బంధువులు, బినామీల ఖాతాల్లోకి మళ్లించారు. రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరును బినామీగా పెట్టుకుని కూడా నారాయణ సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారు. ఆ విధంగా కొనుగోలు చేసిన 65.50 ఎకరాలను ల్యాండ్ పూలింగ్ కింద సీఆర్డీఏకు ఇచ్చారు. అందుకు ప్రతిగా ల్యాండ్ పూలింగ్ ప్యాకేజీ కింద సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో అత్యంత విలువైన 75,888 చదరపు గజాల స్థలాలు పొందారు. పూలింగ్ ప్యాకేజీ కింద ఏటా సీఆర్‌డీఏ ఇప్పటివరకు చెల్లించిన రూ.1.92 కోట్ల కౌలు మొత్తం ఎన్‌స్పైరా ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇదే రీతిలో చంద్రబాబు బినామీలు, సన్నిహితులు సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో భారీగా భూములు గుప్పిట పట్టారు. దీనిపై సీఐడీ దర్యాప్తు కొనసాగుతోంది. త్వరలో మరిన్ని బినామీ లావాదేవీలు బహిర్గతం కానున్నాయి.

■ స్విస్ చాలెంజ్ ముసుగులో 1,691 ఎకరాల దోపిడీ

తమ దోపిడీకి మార్గం సుగమం చేసేలా రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పన చట్టానికి చంద్రబాబు ప్రభుత్వం ఇష్టానుసారం సవరణలు చేసింది. ఓపెన్ కాంపిటీషన్ విధానాన్ని పక్కనపెట్టేసి స్విస్ చాలెంజ్ విధానంలో సీడ్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ ఒప్పందం చేసుకుంది. కౌంటర్ చాలెంజ్‌కు ఇతర కంపెనీలకు అవకాశం లేకుండా చేసి సింగపూర్ కంపెనీకి స్విస్ చాలెంజ్ కింద ఏకపక్షంగా కట్టబెట్టేసింది. సీడ్ క్యాపిటల్ అంచనా వ్యయం రూ.3,137 కోట్లు కాగా నీతి ఆయోగ్ మార్గదర్శకాల ప్రకారం అందులో 25 శాతం అంటే రూ.784 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీలకు బిడ్డింగ్ అర్హత ఉంటుంది. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం కనీసం రూ.2 వేల కోట్ల టర్నోవర్ ఉండటాన్ని అర్హతగా నిర్ణయించడం గమనార్హం. తద్వారా ఇతర కంపెనీలు ఏవీ పోటీకి రాకుండా కట్టడి చేసింది. ఇక సీడ్ క్యాపిటల్ కింద 1,691 ఎకరాల్లో నిర్మాణాలను సింగపూర్ కంపెనీకి కాంట్రాక్టు అప్పగించారు. కానీ అందులో సింగపూర్ కంపెనీ నిర్మించేది కేవలం 8 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలోని భవనం మాత్రమే. అంటే మిగిలిన భూమి అంతా సింగపూర్ కంపెనీకే అప్పగించేశారు. ఆ ప్రకారం ఆ భూమిని ప్లాట్లు వేసుకుని అమ్ముకునే హక్కు కల్పించారు. సింగపూర్ కంపెనీ ముసుగులో చంద్రబాబు, ఆయన బినామీలు భూములను కాజేసేందుకే ఈ పథకం వేశారు.

'ఇన్నర్' మెలికలు

గత సర్కారు పెద్దల ఆదేశాలతో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో కీలక మార్పులు జరిగాయి. చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబానికి కంతేరు, కాజాలో ఉన్న భూములను అనుకుని ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్ రూపొందించారు. సింగపూర్‌కు చెందిన సుర్బానా జ్యురాంగ్ కన్సల్టెన్సీ ద్వారా రూపొందించిన అమరావతి మాస్టర్ ప్లాన్‌లోనే ప్రతిపాదిత ఇన్నర్‌రింగ్ రోడ్ డిజైన్‌ను చంద్రబాబు ప్రభుత్వం ముందుగానే చేర్చింది. అంటే అప్పటికే ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్ ఎలా ఉండాలన్నది నిర్ధారణ అయిపోయింది. సీఆర్‌డీఏ ద్వారా తాము ఖరారు చేసిన అలైన్‌మెంట్‌నే ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ద్వారా తెరపైకి తెచ్చి ఆమోదించారు. కంతేరు, కాజాలో లింగమనేని కుటుంబానికి 355 ఎకరాలున్నాయి. ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను అనుకుని హెరిటేజ్ ఫుడ్స్‌కు ఒకచోట 9 ఎకరాలు, మరో చోట నాలుగు ఎకరాలు ఉండటం గమనార్హం.

పాపాల్లో పవన్‌కూ భాగం

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కూడా ఈ ఇన్నర్‌రింగ్ రోడ్డు అవినీతి పాపంలో చంద్రబాబు వాటా కల్పించారు. కాజా వద్ద ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌కు సమీపంలో పవన్‌కల్యాణ్‌కు 2.4 ఎకరాలున్నాయి. లింగమనేని కుటుంబం నుంచి ఆ భూములను ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.8 లక్షలు చొప్పున కొనుగోలు చేసినట్లు చూపించారు. ల్యాండ్ పూలింగ్ నుంచి మినహాయింపు కల్పించిన భూమినే పవన్ కల్యాణ్‌కు ఇవ్వడం గమనార్హం.

అమాంతం పెరిగిన విలువ

ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారుకు ముందు లింగమనేని కుటుంబం ఆ ప్రాంతంలో ఎకరా భూమి రూ.8 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.50 లక్షలు ఉంది. అంటే ఆ భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్లు. ఇక ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారు తరువాత ఎకరం రూ.36 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. మార్కెట్ ధర ఎకరా రూ.2.50 కోట్లు పలికింది. అంటే 355 ఎకరాల విలువ మార్కెట్ ధర ప్రకారం అమాంతంగా రూ.887.50 కోట్లకు పెరిగింది. అమరావతి పూర్తయితే సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో ఎకరా విలువ రూ.4 కోట్లకు చేరుతుందని నాడు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబే ప్రకటించారు. ఇన్నర్ రింగ్ రోడ్డును అనుకుని ఉన్న భూముల విలువ ఎకరా రూ.6 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. అంటే అమరావతి నిర్మాణం పూర్తయితే ఆ 355 ఎకరాల విలువ ఏకంగా రూ.2,130 కోట్లకు చేరుతుందని అంచనా. ఆ ప్రకారం మార్కెట్ ధరను బట్టి హెరిటేజ్ ఫుడ్స్ 9 ఎకరాల విలువ రూ.4.50 కోట్ల నుంచి రూ.22.50 కోట్లకు పెరిగింది. అమరావతి నిర్మాణం పూర్తయితే రూ.54 కోట్లకు చేరుతుందని తేలింది. హెరిటేజ్ ఫుడ్స్ ఒప్పందం చేసుకున్న మరో నాలుగు ఎకరాల విలువ కూడా రూ.24 కోట్లకు చేరుతుంది.



బాపట్ల జిల్లా నిజాంపట్నంలో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

సభలో మాట్లాడుతున్న ఏపీ సీఎం జగన్

జనంతోనే వారి యుద్ధం

- స్వార్థ రాజకీయాల కోసమే జనసేన–టీడీపీ నీచపు పొత్తులు
- నిజాంపట్నం సభలో సీఎం వైఎస్ జగన్ మండిపాటు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'రాష్ట్రంలో ప్రస్తుతం ప్రతిపక్షాలు జగన్‌తో కాకుండా, జనంతో యుద్ధం చేస్తున్నాయి. నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, ఇతర పేదలందరికీ మంచి చేస్తుంటే గతంలో పాలన సాగించిన వారు, ఆ పాలనకు మద్దతిచ్చిన వారు జీర్ణించుకోలేకపోతున్నారు. పేదవాడికి మంచి జరుగుతుంటే తట్టుకోలేకపోతున్నారు' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే చంద్రబాబుకు మత్స్యకారులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు, ఇతరులు గుర్తుకొస్తారని చెప్పారు. మంగళవారం ఆయన బాపట్ల జిల్లా నిజాంపట్నంలో ఐదో విడత మత్స్యకార భరోసా కింద నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'నేను చేసిన మంచిని, మిమ్మల్ని (ప్రజలు), దేవుడిని నమ్ముకున్నాను. ప్రజలకు ఏ మంచీ చేయని చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పొత్తులని, ఎత్తులని, చిత్తులని, కుయుక్తులనీ నమ్ముకున్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉండీ కూడా చంద్రబాబు పేరు చెబితే ఒక్క స్కీం కూడా గుర్తుకు రాదు. అందరికీ గుర్తుకు వచ్చేది వెన్నుపోటు, మోసం, కుతంత్రాలు మాత్రమే గుర్తుకు వస్తాయి' అని అన్నారు. పేదలకు ఏ మంచీ చేయని ఈ పెద్దమనిషికి ఎవరైనా ఎందుకు మద్దతిస్తారని ప్రశ్నించారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

దోచుకోవడమే వారి సిద్ధాంతం

- ఒక దత్తపుత్రుడు, ఒక దత్త తండ్రి.. వీరి పార్టీలు, సిద్ధాంతం ఒక్కటే. మన రాష్ట్రంలో దోచుకోవడం, దోచుకున్నది పంచుకుని హైదరాబాద్‌లో ఉండటం. ఎంతో మందిని ప్రధాన మంత్రులుగా, రాష్ట్రపతులుగా చేశానని చంద్రబాబు చెబుతుంటాడు. ఆయనకు మాత్రం మన రాష్ట్రంలో ఉన్న 175 స్థానాల్లో ఒంటరిగా బరిలో దిగే సత్తా మాత్రం లేదు.
- దత్తపుత్రుడు ఎమ్మెల్యేగా రెండు చోట్ల పోటీ చేస్తే.. అయ్యా మీరు మాకు ఎమ్మెల్యేగా కూడా వద్దు అని ప్రజలు నమస్కారం పెట్టి ఓడించారు. ఇదే దత్తపుత్రుడు రాజకీయ పార్టీ పెట్టి పదేళ్లు అయింది. 175 నియోజకవర్గాల్లో అభ్యర్థులను పెట్టలేని పరిస్థితిలో ఉంది.
- ఒక్కో ఎన్నికకు ఒక్కో రేటు. పార్టీని హోల్‌సేల్‌గా అమ్ముకునే ఈ ప్యాకేజీ స్టార్ ఈ మధ్యకాలంలో అన్న మాటలు వింటే ఆశ్చర్యం కలుగుతోంది. ఆయన ముఖ్యమంత్రి అయినా, కాకపోయినా పర్వాలేదట. దోపిడీలో రావాల్సిన వాటా వస్తే చాలు అంటున్నాడు. వీళ్లంతా ఇలా ఎందుకు అంటున్నారో.. ఎందుకు కలుస్తున్నారో ఆలోచించండి.
- ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5 వీళ్లంతా ఎందుకు కలుస్తున్నారు? రాష్ట్రాన్ని ఒక గజ దొంగల ముఠాగా దోచుకోవడానికే కలుస్తున్నారు. మరోపక్క మీ బిడ్డ ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని వ్యవస్థలు కత్తికట్టినా, ఎన్ని వ్యవస్థలను ప్రయోగించినా 15 ఏళ్లుగా మీ తరఫునే నిలబడ్డాడు. ఎక్కడా రాజీ పడలేదు. మనందరి ప్రభుత్వం చేసిన మంచిని చెబుతూ, మీ ఇంట్లో మీకు మంచి జరిగితేనే మీ బిడ్డకు తోడుగా మీరు సైనికుల్లా నిలబడాలని కోరుతున్నాను.

జిల్లా వార్తలు

21న వెల్ఫేర్ ఆఫీసర్ ట్రైయినీ (ఇంటర్నల్) రాత పరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న 11 వెల్ఫేర్ ఆఫీసర్ ట్రైయినీ(ఇంటర్నల్) పోస్టుల భర్తీకి ఈ నెల 21న రాతపరీక్ష నిర్వహించనున్నట్లు జీఎం పర్సనల్(వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య తెలిపారు. పరీక్షకు సంబంధించి మార్చిలో నోటిఫికేషన్ విడుదల చేయగా 1,021 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. అందులో కొన్ని దరఖాస్తులు అసంపూర్తిగా ఉండటంతో తొలగించగా, మిగిలిన 675 మందికి హాల్‌టికెట్లు ఆన్‌లైన్ ద్వారా జారీ చేశామని తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని అందులోని వివరాల ప్రకారం కంప్యూటర్ ఆధారిత పరీక్షకు హాజరుకావాలని వెల్లడించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, అలాంటి వారు తారసపడితే తమకు తెలియజేయాలని ఆయన సూచించారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంమయూరిసెంటర్: తొమ్మిదేళ్లుగా రేషన్ డీలర్ల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో 17,200 మంది రేషన్‌డీలర్లు షాపులను నడపలేక, కనీస వేతనం అందక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఇకనైనా సమస్యలు పరిష్కరించకపోతే జూన్ 5వ తేదీ నుంచి సమ్మెకు దిగనున్నట్లు నోటీసులు ఇచ్చిన నేపథ్యాన ప్రభుత్వం స్పందించి వారితో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. రేషన్‌డీలర్ల ఆందోళనలో తాము పాలుపంచుకుంటామని రంగారావు స్పష్టం చేశారు.

కార్మికుల ఆరోగ్యం ఎలా ఉంది?

- సింగరేణి కార్మికుల హెల్త్ ప్రొఫైల్ తయారీ
- ఆరోగ్య సమస్యలు, ఆహార అలవాట్లపై ప్రత్యేక దృష్టి
- పని స్థలం, నివాస ప్రాంతాల్లో పరిస్థితులపై ఆరా



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఇన్నాళ్లు బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలపై అధికంగా దృష్టి సారించింది. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికుల ఆరోగ్యం, ఆహారపు అలవాట్లను కూడా పర్యవేక్షిస్తోంది. కొన్నేళ్లుగా కార్మికులు ఎక్కువగా ఏయే కారణాలతో ఆస్పత్రికి వస్తున్నారు? వారికి ఉన్న జబ్బులు, ఆహారపు అలవాట్లు, చేస్తున్న పని, వాడుతున్న మందులు తదితర అంశాలను సేకరిస్తోంది. అలాగే, దీర్ఘకాలిక వ్యాధులు.. అవి వారసత్వంగా సక్రమించాయా? దురలవాట్లతో వచ్చాయా? ఏ వయస్సులో వ్యాధు లు ఎక్కువగా సోకుతున్నాయనే వివరాలపై దృష్టి సారించారు. ఇక సింగరేణి పని స్థలం లేదంటే అనారోగ్యం, రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన వారి జాబితాలు సిద్ధం చేయడం ద్వారా వాటి నివారణకు కార్యాచరణ రూపొందించే దిశగా సంస్థ సిద్ధమవుతోంది. ఫలితంగా ఇటీవల ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టినా చాలామంది వ్యాధులు, ఇతర కారణాలతో మృతి చెందుతున్నారని గుర్తించినట్లు సమాచారం.

వైద్యం కోసం రూ.కోట్లలో నిధులు

సింగరేణి సంస్థ కార్పొరేట్ ఆస్పత్రుల నిర్వహణకు ఏటా రూ.కోట్లలో నిధులు వెచ్చిస్తోంది. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదని గుర్తించినట్లుగా సమాచారం. దీంతో సింగరేణి కార్పొరేట్ సేఫ్టీ విభాగం ఆధ్వర్యాన కార్మికులకు ఎక్కువగా వస్తున్న వ్యాధులు, అవి సంక్రమించడానికి కారణాలు, వాడుతున్న మందులు, ఫలితాలతో పూర్తి వివరాలు సేకరించి గత ఆగస్టు నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో కార్మికుడి ఈసీ కోడ్ నంబర్ ఆధారంగా ఏ స్థాయి అధికారులైనా వివరాలు తెలుసుకునే అవకాశం ఏర్పడింది. సంస్థ 2020–21 ఆర్థిక సంవత్సరంలో ఆస్పత్రుల నిర్వహణ, కార్పొరేట్ వైద్యానికి రూ.84.99 కోట్లు వెచ్చించగా 2021–22లో రూ.145.32 కోట్లు, కార్మికుల సంక్షేమానికి 2020–2021లో రూ.107.21 కోట్లు, 2021–22లో రూ.121.84 కోట్లు వెచ్చించినా కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫరల్స్ సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దీంతో అసలు మూలాలు తెలుసుకునే పనిలో సంస్థ నిమగ్నమైంది.

2014 నుంచి 2023 మార్చి నాటికి మృతిచెందిన కార్మికులు

ఏడాది	గని ప్రమాదాలు	రోడ్డు ప్రమాదాలు / అనారోగ్యం
2014	9	350
2015	7	316
2016	12	327
2017	12	326
2018	7	246
2019	8	252
2020	12	291
2021	13	344
2022	5	177
2023	1	41

గని ప్రమాదాల్లో కంటే బయటే ఎక్కువ



సింగరేణి సంస్థలో చేరగానే రక్షణ సూత్రాలపై అవగాహన కల్పిస్తాం. వాటిని పాటిస్తే ఏ ఇబ్బంది ఉండదు. ఇక బయటి విషయానికొస్తే ఆహార అలవాట్లు, ప్రయాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉల్లంఘించటం మూలంగా మృతి చెందే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యాన ఇటీవలి కాలంలో ఎవరైనా కార్మికుడు మృతి చెందితే అందుకు గల కారణాలను తెలుసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. గడిచిన ఎనిమిదేళ్లలో గని ప్రమాదాల్లో కంటే ఇతరత్రా కారణాలతో మృతి చెందిన వారే అధికంగా ఉన్నట్లు పరిశీలనలో తేలింది.

–గురువయ్య, జీఎం (కార్పొరేట్ సేఫ్టీ)

పత్తి వ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తాం..

ఎంపీ నామ వినతితో కస్టమ్స్ అధికారి హామీ



హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఎంపీ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: జీఎస్టీ చెల్లింపులకు సంబంధించి ఖమ్మం పత్తి వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని రాష్ట్ర కస్టమ్స్ – సెంట్రల్ టాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ శివనాగకుమారి హామీ ఇచ్చారు. పార్లమెంటరీ సబార్డినేట్ లెజిస్లేషన్ స్టడీ టూర్‌లో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు పాల్గొని ఖమ్మం పత్తి వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను వెల్లడించారు. జీఎస్టీ చెల్లింపులకు సంబంధించి గత మార్చిలో కూడా ఢిల్లీ వెళ్లి జీఎస్టీ చైర్మన్ వివేక్ జోహ్రీ దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. 2017 నుంచి 2019 వరకు ఆర్సీఎం పద్ధతిలో జీఎస్టీ చెల్లించిన ఖమ్మం వ్యాపారులు, ఆ తర్వాత కొత్త విధానంలో ముడి పత్తి అమ్మకాలు, కొనుగోళ్లపై జీఎస్టీ చెల్లిస్తుండగా.. జీఎస్టీ అధికారులు మాత్రం మొదటి నుంచి అమ్మకాలు, కొనుగోళ్లపై జీఎస్టీ చెల్లించలేదంటూ నోటీసులు ఇచ్చారని చెప్పారు. పాత విధానంలోనే పత్తి వ్యాపారులు జీఎస్టీ కట్టినా కేంద్ర ప్రభుత్వానికి ఇబ్బంది లేనందున నోటీసులు ఉపసంహరించుకోవాలని కోరగా, సానుకూలంగా స్పందించిన కస్టమ్స్ – సెంట్రల్ టాక్స్ చీఫ్ కమిషనర్ శివనాగకుమారి సమస్య త్వరగా పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు.

ఆదాయంలో భద్రాద్రి డిపో రికార్డు



ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న డీఎం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆర్టీసీ డిపో రికార్డు స్థాయిలో ఒకేరోజు రూ.25 లక్షలు ఆదాయాన్ని ఆర్జించింది. ఈసందర్భంగా ఉద్యోగులకు మంగళవారం స్వీట్లు పంపిణీ చేసిన డిపో మేనేజర్ బి.రామారావు మాట్లాడుతూ భద్రాచలం డిపోకు సోమవారం రూ.25 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ గౌతమి, ఉద్యోగులు సాహితి, వెంకన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతిపక్షాలన్నీ ఏకమైతేనే బీజేపీకి గుణపాఠం

- సమస్యల పరిష్కారానికి కేసీఆర్ క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివరావు

భద్రాచలం/భద్రాచలంటౌన్: మతతత్వ సిద్ధాంతాలతో ప్రజలను మోసం చేస్తున్న కేంద్రంలోని బీజేపీని గద్దె దించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలన్నీ ఏకం కావాలని.. వారికి సీపీఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. భద్రాచలంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మతం వేరు, విశ్వాసం వేరని కర్ణాటక ప్రజలు చాటిచెప్పారని పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలతో విసిగిపోయిన ఆ రాష్ట్ర ప్రజలు బీజేపీని అధికారానికి అల్లంత దూరాన నిలిపారని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంతో పాటుగా కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకుండా అన్ని పార్టీలు ఏకం కావాలని సూచించారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలన బాగున్నప్పటికీ ఆ మంచిని ప్రచారం చేసుకునేందుకు, ప్రజా సమస్యలను తెలుసుకొనేందుకు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌తో తాము సానుకూల పద్ధతిలో ముందుకు సాగుతున్నా, ప్రజా సమస్యలపై పోరాడతామని స్పష్టంచేశారు. రాష్ట్రంలో పోడు భూములు, ఆర్టీసీ కార్మికుల సమస్యలు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ తదితర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కూనంనేని డిమాండ్ చేశారు. కాగా, భద్రాచలాన్ని మూడు పంచాయతీలుగా విభజించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని ఏపీలో కలిపిన ఐదు జీపీలను తిరిగి కలపాలనే డిమాండ్‌తో తాము పోరాడుతున్నామని వెల్లడించారు. యాద్రాద్రి తరహాలో భద్రాద్రిని రూ.100 కోట్లతో అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సీపీఐ నియోజకవర్గ స్థాయి సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం వేదికగా వచ్చేనెల 4న జరిగే ప్రజాగర్జన బహిరంగ సభను విజయవంతం చేయడం ద్వారా పార్టీ బలాన్ని చాటాలని పిలుపునిచ్చారు. సమావేశాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, నాయకులు రావులపల్లి రాంప్రసాద్, కల్లూరి వెంకటేశ్వర్లు, ఆకోజు సునీల్, తాతాజీ, పోతయ్య, రామిరెడ్డి, బల్లా సాయి, బాలకృష్ణ, రమేశ్, రవీందర్, రామకృష్ణ పాల్గొన్నారు.

పోడు పట్టాల పంపిణీని ప్రారంభించాలి

- కర్ణాటక ఫలితాలు బీజేపీకి చెంపపెట్టు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

భద్రాచలంటౌన్: ఏజెన్సీలో గిరిజనులు, పేదలు ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాల పంపిణీలో రాష్ట్రప్రభుత్వం తాత్సారాన్ని విడనాడి వెంటనే పట్టాల పంపిణీని ప్రారంభించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. భద్రాచలంలో మంగళవారం జరిగిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో తమ్మినేని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10లక్షల ఎకరాల్లోఆదివాసీలు, పేదలు సాగు చేసుకుంటుండగా ప్రభుత్వం మాత్రం మూడు లక్షల ఎకరాలకే పరిమితం చేయడం సరికాదన్నారు. అటవీ హక్కుల చట్టం నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆయన విమర్శించారు. చట్టప్రకారం సాగులో ఉన్న ప్రతీ రైతుకు హక్కు పత్రాలు పంపిణీ చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. అలాగే, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు సీఎం కేసీఆర్ ప్రకటించినట్లుగా వెంటనే పరిహారం చెల్లించడంతో పాటు తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంకా భద్రాచలం కరకట్ట నిర్మాణం, రామాలయ అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన నిధులు వెంటనే విడుదల చేయాలని తమ్మినేని పేర్కొన్నారు. కాగా, కర్ణాటక ఎన్నికల ఫలితాలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చెంపపెట్టు అని.. మతోన్మాద పాలనకు అక్కడ ప్రజలు తగిన బుద్ధి చెప్పారని తెలిపారు. తెలంగాణలోనూ బలపడడానికి బీజేపీ చేస్తున్న కుయుక్తులకు ప్రజలు కుట్రలకు అడ్డుకట్ట వేస్తారని తమ్మినేని ధీమా వ్యక్తం చేశారు. ఈసమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, నాయకులు బండారు రవికుమార్, సూడి కృష్ణారెడ్డి, అన్నవరపు కనకయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, కారం పుల్లయ్య, ఏ.జే.రమేష్, వెంకటరెడ్డి, కె.బ్రహ్మాచారి, ఎం.బీ.నర్సారెడ్డి, యలమంచి రవికుమార్ పాల్గొన్నారు.